దిద్దిబాటు

—బి. అరుణకుమారి

"అమ్మా...!"

"ఏం నాన్నా..!"

"ఇంత రాత్రయ్యింది. నాన్న యింకా ఇంటికి రాలేదేమమ్మా. నాన్న 'గుడ్ నైట్ కిస్' ఇవ్వకుండా నేనెప్పుడయినా పడుకున్నానా..!" ఆవలింతను ఆపుకుంటూ అన్నాడు తొమ్మిదేళ్ళ మండేలా.

"వస్తారు నాన్నా! ఎలక్షన్ డ్యూటీకి వెళ్ళారు కదా! డ్యూటీ అయిపోయి ఏ రైలో పట్టుకొని వచ్చేసరికి అర్ధరాత్రయి పోతుందేమో, నాన్న ముద్దుకూడా నేను ఇస్తానుగా నువ్వు పడుకో!" అంది నునిశిత.

"ఆ..అదేం కుదరదు. నాన్న వచ్చే వరకు నేను మేల్కొనే వుంటాను. అమ్మా! అంత వరకు నాకొక మంచి కథ చెప్పవే!" నిద్రగొంతుకతో గారంగా అన్నాడు.

"ఏం కథ చెప్పేదిరా, నెహ్రూ కథ చెప్పనా...!"

"ఊహూ... ఆకథ చెప్పేశావుగా...!"

"అయితే గాంధీ కథ, మదర్ థెరిస్సా కథ ...భగత్ సింగ్ కథ...ఓ...ఇవి కూడా చెప్పేశానుగా!"

"....."

"పోనీ చెరవకురా చెడేవు, తాడినితన్నే వాడుంటే... ఈకథలు చెప్పేదా!"

"అబ్బ..!అవి కూడా చెప్పిన కథలే కదమ్మా! కొత్త కథలేమైనా చెప్పు!" నిద్ర ఆపుకునే ప్రయత్నంలోంచి పుట్టిన విసుగుతో అన్నాడు.

"అయితే మంచి కొత్త కథ ఆలోచించి చెప్తా నుండు." అంటూ, ఏంకథ చెప్దామా అన్న ఆలోచనలో పడింది నునిశిత.

నునిశిత, ఉత్తేజ్‌లది కులాంతర వివాహం. వారు పరస్పరం అభిప్రాయాలు, ఆదర్శ భావాలు కలవడంతో ఒకరి నొకరు అర్థం చేసుకొని పెళ్ళి చేసుకొన్నారు. వారికి ఒక్కడే బాబు.

దక్షిణాఫ్రికా గాంధీ నెల్సన్ మండేలా ఉద్యమ నిర్వహణ ధోరణికి ముగ్ధులై, ఆ ప్రభావం వల్ల వారి బిడ్డకు మండేలా అని పేరు పెట్టుకున్నారు.

ప్రతి రాత్రి అమ్మ కథ, నాన్న ముద్దులు లేనిదే మండేలాకు నిద్రరాదు. అట్లాగని ఏ దయ్యంకథలో, రాక్షసుని కథలో లేక సినిమా కథలో చెప్పడం అలవాటు చెయ్యలేదు నునిశిత.

అలాంటి కథలు చెప్పమని బాబు కోరనూ కోరడు.

అందుకే, మనదేశంలో స్వాతంత్ర్యం ముందు, స్వాతంత్ర్యానంతరం జరిగిన విప్లవాత్మక చరిత్రను కథల రూపంలో కొడుకుకి చెబుతూంటుంది నునిశిత.

దేశం గురించి, మనుష్యుల గురించి, మానవత్వం, అధికారం...ధన దాహం, నిరంకుశత్వం, విప్లవం వంటి విషయాలమీద అవగాహన లేక పోతే ఏ బాలుడైనా మంచి పౌరుడుగా రూపు దిద్దు కోలేడు అని ఆమె అభిప్రాయం. అలాంటప్పుడు జీవితానికి లక్ష్యమంటూ వుండక పిల్లలు తెగిన గాలిపటంలా తయారవుతారని ఆమె భావన.

అందుకే... తమ బిడ్డను అలాంటి 'అపురూప వ్యక్తి'గా తయారు చేయడమన్నదే ఆమె ధ్యేయం.

"బాబూ...!

"ఊ....!"

"కథ చెప్పమన్నావుగా వింటావా, నిద్రపోతావా!"

"కథ చెప్పమ్మా...!"

"సరే విను...!"

'అనగనగా అనంత విశ్వం. అనంత విశ్వంలో భూగ్రహమనే జీవ కోటికి నివాస యోగ్యమైన గ్రహం. ఆగ్రహంలో బోలెడన్ని దేశాలున్నాయి. అందులో భారత దేశం ఒకటి.

"అంటే మనదేశమే కదమ్మా!"

"ఆ..., మన దేశంలో కథలకు కొదవలేదు. ఎప్పుడో జరిగిపోయిన కథలెందుకు. ఇప్పుడు జరిగేవే కోకొల్లలు.

'స్వాతంత్ర్యానంతరం కులరాజకీయాల వలన ప్రజల మధ్య విభేదాలు పెరిగిపోయాయి'.

'సాటి మనిషిని తన కాళ్ళ క్రింద మెట్లుగా వుపయోగించుకొని, ఎంత ఎత్తు కెదిగి ఆధిపత్యం చెలాయిద్దామా అని ఆలోచించేవారే ప్రతిఒక్కరూ. మానవత్వం, మంచి చెడుల విచక్షణ మానవులలో నశించిపోయి చాలా కాలమయ్యింది.

సమాజంలో అడుగడుగునా హత్యలు, లూటీలు, వరకట్న చావులు, రాజకీయ వివాదాలు, అన్యాయాలు.....చివరికి మనిషిని మనిషి అమ్ముకుతినే స్థితి కొచ్చింది దేశం.

దేశం దేహం కుళ్ళి పోయి కంపుకొడుతూంది. నిపుణులైన వైద్యులు ఉద్భవించి, దేశానికి శస్త్ర చికిత్స చేసే వరకు ఈ దేశం బాగుపడదు."

ఆవేశంగా చెప్పుకుపోతున్న నునిశిత ఏదో గుర్తుకు వచ్చినట్లు టక్కున కథ ఆపేసి, 'ఇంత పెద్ద మాటలు ప్రయోగించి నా ధోరణిలో నేను కథ చెప్పుకుంటూ పోతే- బాబుకు అర్థం అవగలదా? అనుకుని-

"బాబూ !ఈ రోజుకీ కథ చాలుగానీ, నీకీ కథ ఏమైనా అర్థమయ్యిందా!"

"ఆ...!, నువ్వు కథలో చెప్పిన పెద్ద పెద్ద మాటలు అర్థం కాలేదుగానీ, కథ ఏంటో అర్థం అయ్యింది!"

"ఏమి అర్థం అయ్యిందీ...!

"మన దేశం కథ' ఎలా వుందో అర్థం అయ్యింది. దేశం బాగుపడాలంటే, నా లాంటి పిల్లలు పెరిగి పెద్దఅయి ఏంచెయ్యాలో కూడా అర్థమయ్యింది.!"

"ఏం చెయ్యాలీ...!" బాబు ఏదో చెప్పబోతున్నంతలో కాలింగ్ బెల్ మ్రోగింది.

"అదుగో నాన్న వచ్చినట్లున్నారు.నేను వెళ్ళి తలుపు తీస్తాను." అంటూ మంచంమీంచి క్రిందకు దిగి పరుగున వెళ్ళి తలుపు తీశాడు మండేలా.

"లాక్ పడని సూట్ కేస్ కిర్రు, కిర్రు మంటూండగా, వాచీ వుండాల్సిన ఎడమ చేయి. ముంజేయి గీరుకు పోయి రక్తం కారుతుండగా, చిరిగి పోయిన షర్టుతో, చెదిరి పోయిన జుట్టుతో..రాత్రి ఒంటిగంటకు ఇంట్లోకి అడుగు పెట్టాడు ఉత్తేజ్.

"ఏం జరిగిందండీ!" గాభరాగా అడిగిన భార్య ప్రశ్నను వినిపించుకోకుండా

"నన్ను ఈ దుస్థితిలో చూస్తూంటే నీకేమని పిస్తోందో చెప్పనా అర్ధరాత్రి ఒంటరిగా ఆడదే కాదు, మగాడు కూడా క్షేమంగా కొంపకు చేరలేని కాలమొచ్చిందీ అని.!" వాతావరణాన్ని తేలిక పరచడానికా అన్నట్లు, నవ్వడానికి ప్రయత్నిస్తూ- అయోమయంగా చూస్తున్న భార్యనుద్దేశించి అన్నాడు ఉత్తేజ్.

భర్త మాటలకు మనసు తేలిక పడలేదు నునిశితకు.

"అసలు ఏం జరిగిందండీ!" ఆత్రాన్ని అణచుకోలేక మళ్ళీ అడిగింది.

"ఎలక్షన్ డ్యూటీ చేసి అలసిపోయి తిరుగు ప్రయాణంలో, రైల్లో కునుకుతీస్తున్న నన్ను నిలువు దోపిడీ చేశాడెవడో రాస్కెల్. తాడిని దన్నేవాడి తల దన్నేవాడు పుట్టే వరకూ....ఇలాంటి దోపిడీలు జరుగుతూనే వుంటాయి!" అని మాత్రమే అనగలిగాడు.

ఇందాక అమ్మ చెప్పిన కథలోని బాధితులకు ప్రతినిధిలా వున్న నాన్నను చూస్తూ, ముద్దు అడగడం కూడామరచిపోయి...తాడిని దన్నేవాడి తలదన్నేవాడు... అన్నతండ్రి మాటలు పదే పదే బుర్రలో నుళ్ళు తిరుగు తూండగా, ఆలోచిస్తూ కళ్ళు మూసు కున్నాడు మండేలా.

* * *

మర్నాడు ఉదయం నిద్రలేస్తూనే, పళ్ళు తోముకో మన్న తల్లిమాటలు వినిపించుకోకుండా అడి గాడు మండేలా.

"అమ్మా! దేశాన్ని దొంగలు దోచేస్తున్నారు కదా!"

"కాదు బాబు! దేశంలోని అమాయక జీవుల చెమటను,శ్రమను మానవత్వాన్ని దోచేస్తున్నారు.!"

"అంటే దేశాన్నే కదా!"

"అవునేమో.....!"

"అయితే నేను పెద్ద దొంగనయిపోతా అప్పుడిక నువ్వు కాని, నాన్న కాని అర్ధ రాత్రులలో, ఏ పనిమీద బయటికెళ్ళినా మా అమ్మ, నాన్న కాబట్టి మిమ్మల్ని ఎవరు ఏమీ చెయ్యలేరు కదా!" అన్నాడు.

హతాశురాలయింది నునిశిత. కాస్సేపు ఆమె మెదడు మొద్దు బారిపోయి, తిరిగి పని చెయ్యడం ప్రారంభించింది.

రాత్రి భర్త చివరగా అన్న మాటలకు- వీడు ఇలా అర్థం తీసుకున్నాడన్న మాట. అయినా బాబు ఇంట్లో వున్నంత వరకు తను చెప్పిన నీతి పాఠాలు వాడి బుర్రలో వుంటాయేమో గానీ వాడు బయటికి పోతూంటాడు. అలాంటప్పుడు సమాజంలోని 'నెగిటివ్ మెంటాలిటీ' ప్రభావం బాబు మీద పడకుండా ఉంటుందా?! అందుకే తను బాబును కోప్పడ కుండా, పెడ త్రోవ పడుతున్న వాడి ఆలోచనా ధోరణిని- మంచి మాటలు చెప్పి, సరిదిద్దడానికి ప్రయత్నించాలి అనుకుంది నునిశిత. ❑